అక్రమ 'రెవెన్యూ'కు అడ్డేదీ..!

- కాసులు కురిపిస్తున్న ఇంటి పన్ను పేరు మార్పు
- అయ్యగారిని ప్రసన్నం చేసుకోనిదే.. కొత్త పన్ను పడదు
- ఆన్‌లైన్ చేయొద్దంటూ సచివాలయ సిబ్బందికి అనధికార హుకుం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అవినీతి రాజ్యమేలుతోంది. ఇంటి పన్ను పేరు మార్పునకు రూ.లక్షలు వసూలు చేయటంతో పాటు కొత్తగా ఇల్లు కట్టుకున్న వారి పేరిట పన్ను వేయాలంటే ముందుగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లను కలవకుండా సచివాలయాల్లో ఆన్‌లైన్ చేయవద్దనే హుకుం జారీ చేసి, అందినంత దోచుకుంటున్నారు.

తెనాలి పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. తెనాలిలోని చెంచుపేట, అమరావతి ప్లాట్స్, బాలాజీరావుపేట, మారీసుపేట, కొత్తపేట, నందులపేట, రామలింగేశ్వరపేట, బుర్రిపాలెంరోడ్డు, నాజరుపేట, ఐతా నగర్ వంటి ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. ఆయా ప్రాంతాల్లో ఎవరైనా స్థలం కొనుగోలు చేసి, ఇల్లు కట్టుకోవాలంటే మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగాల్లో పనిచేసే అధికారుల చేయి తడపనిదే అనుమతులు ఇచ్చే పరిస్థితి కన్పించటం లేదు. తెనాలి పట్టణంలో నెలకు సగటున ఇంటి పన్నుల కోసం 15 నుంచి 20 వరకు దరఖాస్తులు వస్తుంటాయి. వాటిని పరిశీలించి, పన్ను వేయాలంటే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు స్థలం రేటును బట్టి లంచాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఉదాహరణకు మారీసు పేటలోని ఓ వ్యక్తి రూ.50లక్షల విలువ చేసే ఇల్లు కట్టుకున్నాడు. అతనికి ఇంటి పన్ను పేరు మార్పు కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో సదరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నూతన పన్ను వేయాల్సి ఉండగా, రకరకాల కారణాలతో వేయకుండా ఆపివేశారు. దరఖాస్తుదారుడు అధికారిని ప్రసన్నం చేసుకున్న తర్వాత మాత్రమే పన్ను వేయడం జరిగింది. ఇలా చెప్పుకుంటూ పోతే తెనాలి పట్టణంలో ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.



తెనాలి మున్సిపల్ కార్యాలయం

అనుమతి లేకుండా ఆన్‌లైన్ చేయవద్దు.

తెనాలి పట్టణంలోని చెంచుపేట, పినపాడు, ముత్తింశెట్టి పాలెం, కొత్తపేట, మారీసుపేట తదితర ప్రాంతాల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సచివాలయ అడ్మిన్‌లకు తన అనుమతి లేకుండా ఇంటి పన్ను మార్పునకు సంబంధించిన అప్లికేషన్లు ఆన్‌లైన్ చేయొద్దని కొద్ది నెలల క్రితం హుకుం జారీ చేశారు. దీంతో ఎవరైన ఇంటి పన్ను పేరు మార్పు కోసం అన్ని పత్రాలతో సచివాలయానికి వెళ్తే వారి నుంచి వచ్చే సమాధానంతో యజమానులు విస్తుపోతున్నారు. ముందుగా సదరు రెవెన్యూ అధికారిని కలిసి వచ్చిన తర్వాతే.. ఆన్‌లైన్ చేస్తామని సమాధానం సచివాలయ ఉద్యోగుల నుంచి వస్తోంది. దీంతో చేసేది లేక వారు ముందుగా ఆయనను కలిసి, బేరం మాట్లాడుకొన్న తర్వాతే ఆన్‌లైన్ చేయించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాలను కూడా ఇలాంటి అధికారులు కలుషితం చేస్తున్నారనటంలో ఎటువంటి సందేహం లేదు. ఇంత తెలిసినా మున్సిపల్ అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరించటం పలు విమర్శలకు తావిస్తోంది.

కాసులు కురిపిస్తున్న అన్ రిజిష్టర్డ్ వీలునామాలు

కుటుంబ తగాదాల నేపథ్యంలో కొందరు తప్పుడు వీలునామాలు సృష్టించి ఆస్తులను వారి పేరిట మార్చుకునే పనిలో పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న రెవెన్యూ అధికారులు వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేస్తూ.. వారి పేరిట ఇంటి పన్ను మార్పు చేస్తున్నారు. సాధారణంగా ఏదైన వీలునామాకు సంబంధించిన సందేహాలు, ఇంటి పన్ను మార్పు సమయంలో లీగల్ ఒపీనియన్ తీసుకుని చేయాల్సి ఉంటుంది. తెనాలిలో అలాంటి వేమి లేకుండా అవలీలగా పన్నులపై పేర్లు మార్చివేస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరపటంతో పాటు లంచాలకు అలవాటు పడిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. అలాగే సచివాలయ సిబ్బందిని బెదిరించి ఆన్‌లైన్ చేయకుండా చేస్తున్న సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



సాధారణంగా సచివాలయం ద్వారా ఇంటి పన్ను పేరు మార్పునకు దరఖాస్తు చేసుకోవాలి. అన్ని డాక్యుమెంట్లు ఉంటే వెంటనే ఆన్‌లైన్ చేసి, మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగానికి పంపాలి. తర్వాత సదరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ అధికారులు వాటిని పరిశీలించి నూతన పన్ను వేయాల్సి ఉంటుంది. అలా కాకుండా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తమను కలవకుండా ఆన్‌లైన్ చేయవద్దని చెప్పటం పద్ధతి కాదు. వెంటనే రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి, స్పష్టమైన ఆదేశాలు ఇస్తాం. రెవెన్యూ విభాగంపై అప్పుడప్పుడు ఆరోపణలు వినిపిస్తున్న మాట వాస్తవం. ఆరోపణలపై విచారణ జరిపి, నిర్ధారణ జరిగితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

–ఎం.జశ్వంతరావు, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

క్లుప్తంగా

బాలికల వసతి గృహంలో దోమల మందు పిచికారి



తెనాలిఅర్బన్: దోమల నియంత్రణలో భాగంగా ఆర్ఆర్ నగర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో మంగళవారం మలాథియన్ ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల మాట్లాడుతూ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జ్ అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బండి విజయ్‌కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారిణి రామనాథం ప్రమోదిని, కంచర్ల రజనీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'అవతార పురుషుడు' పుస్తకావిష్కరణ



తెనాలి: చిత్రపరిశ్రమ, రాజకీయాల్లో నందమూరి తారక రామారావు ప్రశంసలందుకున్నారని సినీ, మాటల రచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా అన్నారు. ఎన్టీఆర్ జీవిత విశేషాలతో పట్టణానికి చెందిన బాలసాహితీ వేత్త షేక్ అబ్దుల్ హకీంజాని రచించిన 'అవతార పురుషుడు' పుస్తకాన్ని స్థానిక ముత్యం శెట్టి పాలెంలోని వీజీకే అండ్ వీవీఎల్ ఫౌండేషన్ హాలులో మంగళవారం ఉదయం ఆయన ఆవిష్కరించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, ఫౌండేషన్ కోశాధికారి తుమ్మల కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



తెనాలిఅర్బన్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, కాల్వల పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయానికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో 35వ వార్డులో నూతన రోడ్డుకు మంగళవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం వార్డులో పర్యటించి, ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, తాడిబోయిన నాగార్జున, డీఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అరటి పంట దగ్ధం



కొల్లిపర: ప్రమాదవ శాత్తు అరటి పంట దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి మండలంలోని బొమ్మువానిపాలెంలో చోటుచేసుకుంది. ఘటనపై రైతులు తెలిపిన వివరాల మేరకు.. కొల్లిపర గ్రామానికి చెందిన బొంతు పున్నారెడ్డి, బొంతు వెంకటరెడ్డి అరటి తోటలు నిప్పు అంటుకుని దగ్ధమయ్యాయి. పున్నారెడ్డి తోట 30 సెంట్లు, వెంకటరెడ్డి తోట 35 సెంట్లలో అరటి పంట పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. గ్రామ సచివాలయం హార్టికల్చర్ అధికారి కోటిలక్ష్మి మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి, నివేదికను ఉన్నతాధికారులకు పంపారు.

17న 52వ అమావాస్య హోమం

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 17న దేవాలయంలో 52వ అమావాస్య హోమం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

విద్యా సంస్కర్త సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



విద్యాకానుక కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

- తెనాలి నియోజకవర్గంలో రూ.3కోట్లతో 'విద్యాకానుక'
- కిట్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని

తెనాలి: పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, వారికి బంగారు భవిష్యత్తును అందించాలని కృతనిశ్చయంతో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యా సంస్కర్త అనిపించుకున్నారని కొనియాడారు. రూరల్ మండలం అంగల కుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. హెచ్‌ఎం అనూరాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని, మాట్లాడారు. గతంలో అంగలకుదురు పాఠశాలలో మరుగుదొడ్ల కొరతతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అగచాట్లు పడేవారని గుర్తుచేశారు. నేడు అంగలకుదురు పాఠశాలను మించి ఉన్న ప్రైవేటు పాఠశాల కూడా తెనాలి నియోజకవర్గంలో లేదని పేర్కొన్నారు. క్వాలిఫైడ్ టీచర్లు, తరగతి గదులు, చక్కని మరుగుదొడ్లు, క్రీడామైదానంతో విలసిల్లుతోందని కొనియాడారు. తహసీల్దారు కె.రవిబాబు, ఎంఈఓ డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. మండలంలో రూ.1.01కోట్లతో 12,041 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్‌లను అందజేస్తున్నట్టు చెప్పారు. పాఠశాల విద్యాకమిటీ మాజీ చైర్మన్ చుండూరు సతీష్‌కుమార్, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, ప్యారం అరుణ, వార్డు సభ్యురాలు గార్లపాటి పన్నకుమారి, బండి జగన్‌మోహన్, కావూరి కిషోర్, కమిటీ చైర్మన్ రాజేష్, జాష్టి శ్రీనివాసరావు, కడియాల సురేష్, ఉరిటి నాగేశ్వరరావు, తోట శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.3 కోట్లతో జగనన్న 'విద్యాకానుక'

తెనాలిటౌన్: తెనాలి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ.3 కోట్ల జగనన్న విద్యాకానుక కిట్‌లు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. విద్యార్థులు కిట్లు ఉపయోగించుకోవాలని సూచించారు. కొలకలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్‌లను ఎమ్మెల్యే శివకుమార్ విద్యార్థులకు అందజేశారు. అనంతరం జరిగిన సభకు స్కూల్ ఉపాధ్యాయుడు మత్తే అన్నారావు స్వాగతం పలుకగా, ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాతూ విద్యార్థులు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించాలని, క్రమశిక్షణతో పాఠశాలకు వచ్చి చదువుకోవాలని సూచించారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించారని గుర్తుచేశారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యా కానుకలు అందజేయడం అభినందనీయమన్నారు. మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా క్వాలిటీ కిట్‌లను అందజేస్తున్నామన్నారు. మండలంలో 12,041 కిట్‌లను పంపిణీ చేస్తున్నామని, విద్యార్థులు వాటిని సక్రమంగా వినియోగించుకునే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, తహసీల్దార్ కె.రవిబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పినపాటి అనిల్ కుమార్, పాఠశాల దాత ప్రసాదం సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొలకలూరి నాగేశ్వరరావు, ప్రసాదం రాధారావు, కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ.4.79లక్షల జరిమానా


వివరాలు తెలియజేస్తున్న ఈఈ చిరంజీవి

తెనాలిటౌన్: పట్టణంలోని విద్యుత్ డి–3 సెక్షన్ పరిధిలో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేవీఎల్ఎన్.మూర్తి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి ఆధ్వర్యంలో అధికారులు 61 బృందాలుగా ఏర్పడి, పట్టణంలో తనిఖీలు చేశారు. అదనపు లోడు, అనధికార కనెక్షన్లు, మల్టిపుల్ సర్వీసులు తనిఖీ చేశారు. 4,593 సర్వీసులు తనిఖీ చేయగా అదనపులోడు వాడుతున్న 164 మంది గుర్తించి వారికి జరిమానా కింద రూ.4,54,434 విధించినట్లు ఈఈ చిరంజీవి తెలిపారు. అధికార కనెక్షన్లకు రూ.25వేలు ఫైన్ విధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, అక్రమంగా విద్యుత్ వాడినట్లయితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

బాధ్యతతో విధులు నిర్వహించాలి

తెనాలిఅర్బన్: బాధ్యతతో విధులు నిర్వహిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెనాలి ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి తెనాలికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో కొత్తపేటలోని మండల విద్యాధికారి కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని చెప్పారు. విద్యాబోధనలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ పనిచేయాలన్నారు. మండల స్థాయిలో జరిగే శిక్షణ తరగతుల్లో పాల్గొంటూ రికార్డుల నిర్వహణ సరిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు అకడమిక్ క్యాలెండర్ పాఠ్యంశాల బోధన జరగాలన్నారు. సమావేశంలో ఎంఆర్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గతంలో ఎన్నడూ లేని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని, అందుకు గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, 'నాడు–నేడు' పథకం నిదర్శనమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో మంగళవారం రాత్రి ఆయన నిర్వహించారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి గ్రామంలోని ఇంటింటికీ తిరిగారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. నాడు–నేడు పథకం కింద పెదరావూరు గ్రామంలోనే రూ.2కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశామని చెప్పారు. గ్రామ వైశాల్యాన్ని పెంచే విధంగా జగన్న కాలనీలు, రెండు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పెదరావూరు గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీటీసీ రావూరి ఏసుదాసు, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, రావూరి విజయ్, గోరికపూడి బాలరాజు, అక్కిదాసు కిరణ్‌కుమార్ ఉన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

హౌసింగ్ పీడీ వేణుగోపాల్

దావులూరు(కొల్లిపర): వైఎస్సార్ జగనన్న కాలనీల గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ పీడీ ఎస్.వేణుగోపాల్ ఆదేశించారు. మంగళవారం దావులూరు గ్రామంలోని కాలనీలో గృహ నిర్మాణాలను హౌసింగ్ ఈఈ భాస్కర్‌తో కలసి ఆయన పరిశీలించారు. కాలనీలో సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లే అవుట్‌లో లెవలింగ్, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పీడీ సిబ్బందికి సూచించారు. అనంతరం పలు విషయాలపై సచివాలయం, హౌసింగ్, మండలస్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, పీఆర్ డీఈఈ గుప్తా, ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, సచివాలయం ఇంజనీర్లు పాల్గొన్నారు.


లే అవుట్‌లో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ వేణుగోపాల్

సచివాలయం ఆకస్మిక తనిఖీ

పిట్టలవానిపాలెం: ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ అల్లూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా మంగళవారం తనిఖీచేశారు. సచివాలయానికి వచ్చే ప్రజలను గౌరవించాలని, వెంటనే పనులను చేసి పంపించాలని సిబ్బందికి సూచించారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ పద్మజ, గ్రామ కార్యదర్శి శివకుమార్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మద్యం మత్తులో ఆటోడ్రైవర్ హల్‌చల్

పట్నంబజారు: పూటుగా మద్యం సేవించి ఆటో డ్రైవర్ హల్‌చల్ చేసిన ఘటనపై కేసు నమోదైంది. ట్రాఫిక్ పోలీసులు వివరాల మేరకు వేమూలురుపాడుకు చెందిన సయ్యద్ సాధిక్ తన ఆటోలో గుంటూరుకు మంగళవారం బాడుగ నిమిత్తం వచ్చాడు. శారదా కాలనీలో పూటుగా మద్యం సేవించి ఇష్టానుసారంగా ఆటో నడుపుతూ కొత్తపేట శివాలయం వద్ద ఇరువురు మహిళలను ఢీకొట్టాడు. వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ డ్రైవింగ్‌ంతో భయానక వాతావరణం నెలకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు మండలం పచ్చల తాడిపర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని చింపివేయడంపై మంగళవారం గ్రామ సర్పంచ్ పెరికల కృష్ణమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పచ్చల తాడిపర్రు బస్ షెల్టర్ వద్ద పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ అభిమానులు భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మంగళవారం ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఈ సంఘటన గ్రామంలో వివాదానికి దారి తీసింది. గ్రామ సర్పంచ్ పెరికల కృష్ణ మోహన్ ఎస్ఐ భార్గవ్‌కు ఫిర్యాదుచేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకుల అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటుకూరు రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద సింగిల్‌నంబరు లాటరీ ఆడిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 6,810లు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

నగదు గోల్‌మాల్ ఘటనలో ఇద్దరి అరెస్ట్

పట్నంబజారు: సెల్‌ఫోన్ షాపులో నగదు గోల్‌మాల్ చేసిన ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సంగీత మొబైల్‌షాపులో గత కొద్దిరోజుల క్రితం అకౌంట్ విభాగం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈనేపథ్యంలో రూ. 4 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు కనబడకపోవడంతోపాటు, నగదును మేనేజర్ అప్సర్‌బాషా, క్యాషియర్ ఫిరోజ్ దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. ఈమేరకు సంగీత మొబైల్ షోరూమ్స్ జిల్లా ఇన్‌చార్జి రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

పింఛన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెనాలి ఉప ఖజానా కార్యాలయ పరిధిలో పింఛన్ తీసుకుంటున్న విశ్రాంత ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తెనాలి సహాయ ఖజానా అధికారి ఎం.శ్రీరామచంద్రమూర్తి మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు చేయించుకోని వారు తమ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు.

మున్సిపల్ వర్కర్ అదృశ్యం

తెనాలిరూరల్: మున్సిపల్ వర్కర్ అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని పాండురంగపేటకు చెందిన మేళం నారాయణ తెనాలి పురపాలక సంఘంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 10న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా.. ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్ కుమార్ మంగళవారం రాత్రి తెలిపారు.

మామను చాకుతో పొడిచిన అల్లుడు..

వేమూరు: మామను అల్లుడు చాకుతో పొడిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఘటన చోటుచేసుకోగా.. మంగళవారం కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు.. పోతుమర్రు గ్రామానికి చెందిన గరిక పాములు కూతురు సుబ్బలక్ష్మి, అదే గ్రామానికి చెందిన పట్టా సాంబశివరావు భార్యాభర్తలు. గత ఆదివారం సాంబశివరావు మద్యం సేవించి, భార్యను కొట్టాడు. దీంతో సుబ్బలక్ష్మి వెళ్లి.. తల్లికి విషయం చెప్పి బాధపడింది. ఈ విషయమై ఆమె తన అల్లుడు సాంబశివరావును ప్రశ్నించగా.. వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో గరిక పాములు చికెన్ స్టాల్ మూసి, ఇంటికి వచ్చిన తర్వాత అల్లుడు కూతురిని కొట్టి విషయాన్ని భార్య అతనికి చెప్పింది. దీంతో పాములు వెళ్లి.. సాంబశివరావును కర్రతో కొట్టాడు. కోపోద్రిక్తుడైన సాంబశివరావు తన దగ్గరున్న చాకుతో మామను పొడిచాడు. దీనిని గమనించిన బంధువులు వెంటనే 108 వాహనంలో పాములును తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్య కోసం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లారు. హాస్పిటల్ సిబ్బంది వివరాల మేరకు.. ఎస్ఐ చంద్ర శేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, సేవా గుణం కలవారు ముందుకు రావాలని నల్లమోతు వారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర వెంకట సాంబశివరావు కోరారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని కాటూరి చిన నారాయణ పూరిగుడిసె, వరిగడ్డి వామి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. ఈ నేపథ్యంలో మంగళవారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండ్ర సాంబశివరావు, మాజీ సైనికులు బాధితుడు కాటూరి చిన నారాయణను పరామర్శించారు. రూ. 25వేల నగదు, వంట పాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు టి.దుర్గారావు, జె.జోసెఫ్, సయ్యద్ అఖిల్, కె.సుబ్బారావు తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు అగ్ని ప్రమాద బాధితునికి కర్లపాలెం సర్పంచ్ నక్కా లలితకుమారి కుమారుడు నక్కా సంతోష్ కుమార్ రూ.10వేలు నగదు అందజేశారు. సంతోష్‌కుమార్ వెంట ఉప సర్పంచ్ అహ్మద్ బాషా, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఉన్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బాపట్ల అర్బన్ : క్రెడిట్ ప్లాన్ అమలులో భాగంగా మండల సమాఖ్య కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఎంపీడీవో రాధాకృష్ణ మాట్లడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాలను ఉపయోగించుకొని ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇండస్ట్రీస్ డిపార్ట్ మెంట్ ఏడీ సూరిబాబు, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ ఎఫ్‌డీఓ రవీంద్ర, పశు సంవర్ధక శాఖ డాక్టర్ గోపికృష్ణ , వ్యవసాయ శాఖ నుంచి ఏఈఓ ప్రశాంతి తమ పరిధిలోని పథకాలను, రాయితీలను వివరించారు. ఏపీఎం సురేష్ మాట్లడుతూ వివిధ శాఖల పథకాల అమలుకు డీఆర్‌డీఏ నుంచి బ్యాంక్ రుణ సదుపాయం కల్పించి, యూనిట్ల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.